'హర్ ఆర్ట్ గ్యాలరీ' సందర్శన

చిక్కడపల్లి: హర్ ఆర్ట్ గ్యాలరీ విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని ప్రముఖ హస్త కళాకారిణి డాక్టర్ కమలాప్రసాదరావు పేర్కొన్నారు. పాఠ్య ప్రాణాళికకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సోమవారం చిక్కడపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్యాలరీ మేనేజింగ్ ట్రస్టీ పీవీయస్ ప్రసాదరావుతో కలసి ఆమె మాట్లాడారు. ఆర్ట్ గ్యాలరీని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు సందర్శించి కళారూపాల తయారీ విషయంలో మెళకువలను అడిగి తెలుసుకున్నారు.

పార్టీ బాధ్యతలను సవాలుగా స్వీకరించాలి



అంబర్‌పేట: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. డివిజన్లకు కొత్త అధ్యక్షులుగా నియమితులైన వారిని కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా వారి నివాసం వద్ద కలిసి పార్టీ బలోపేతానికి అనుసరించాల్సి అంశాలను చర్చిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ నివాసానికి మంత్రి విచ్చేసారు. పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌తో వెళ్లి తేనీటి విందు స్వీకరించారు. కొత్త బాధ్యతలు తీసుకున్నప్పుడు ఇంటా బయట సవాళ్లు ఉంటాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు.

పురస్కారాల ప్రదానోత్సవం

చిక్కడపల్లి: సాంస్కృతిక రంగంలో సేవలందించిన వారిని గుర్తించి గౌరవించడం అభినందనీయమని ఎస్వీ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రముఖ సాంస్కతిక సంస్థ రసమయి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో సాంస్కృతిక రంగ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖులు పీఎస్ కోటేశ్వర్‌రావు, రామ రాజులక్ష్మీ శ్రీనివాస్, కావూరి శ్రీనివాస్, ఖదీర్‌బాబు, డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి, డాక్టర్ కేవీ జ్ఞానకుమార్‌కు ఆయన పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ సాహిత్యం, కళలను ఆరాదించడం జీవితానికి సార్థకత అని అన్నారు.

సీహెచ్ కర్ణా మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు

ముషీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన సీహెచ్ కర్ణా మృతి బీఆర్ ఎస్‌కు తీరని లోటు అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్ర కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సీహెచ్ కర్ణా సంతాప సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాబోయే ఎన్నికల్లో విజయానికి నాంది రజతోత్సవ సభ

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి నాంది వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో వరంగల్ బహిరంగ సభకు తెలంగాణ ప్రజలు లక్షలాదిగా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచారని తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని రేవంత్‌రెడ్డి తన 16 నెలల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా 17వ స్థానానికి నెట్టారని ఆరోపించారు. త్వరలో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో... పానీ పరేషాన్..

- అంబర్‌పేట మున్సిపల్ దవాఖానాలో నీటి కటకట
- 4 రోజుల కిత్రం మరమ్మతులకు గురైన బోరు
- మరోవైపు నల్లా కనెక్షన్ లేని వైనం
- వైద్య సేవలు, ప్రసవాలకూ తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అంబర్‌పేట మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ ఏరియాస్పత్రి

అంబర్‌పేట: మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నది. ఉన్నా ఒకేఒక బోరు 4 రోజుల క్రితం మరమ్మతులకు గురికావడం, మరోవైపు నల్లా కనెక్షన్ లేకపోవడంతో అటు రోగులు, ఇటు వైద్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడూ వైద్య సేవలకు సైతం ఆటంకం కలుగుతోంది. ఆస్పత్రికి నిత్యం 200 పైగా ఓపీ, 10 మంది ఇన్ పేషెంట్లకు సేవలు అందిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు చేయడంతో పాటు వైద్యం, అలాగే ప్రసవాలు కూడా చేస్తుంటారు. అయితే ఇప్పుడు నెలకొన్న నీటి కటకటతో ఆపరేషన్లు, వైద్య సేవలు అందించడం ఎంతో క్లిష్టతరంగా మారింది.

మరమ్మతులో బోరు..

ఇంత పెద్ద ఆస్పత్రిలో ఒకటే బోరు ఉంది. ఇది కాస్త 4రోజుల క్రితం మరమ్మతుకు గురైంది. దానికి మరమ్మతులు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రోగికి చిన్న డ్రెస్సింగ్ వేసి వైద్య సిబ్బంది చేతులు కడుక్కోవాలన్న నీళ్లు లేని పరిస్థితి నెలకొన్నది.

మున్సిపల్ నల్లా కనెక్షన్ లేని వైనం..

ఈ ఆసుపత్రి ద్వారా 30 ఏళ్లకు పైగా ఎంతో మంది వైద్య సేవలు పొందారు. ఈ దవాఖానాను అభివృద్ధి చేస్తున్నామని, చేస్తామని ఎంతోమంది అధికారులు, ప్రజా ప్రతినిధులు తరచూ సందర్శించి హామీలిచ్చి వెళ్లారే తప్ప ఇప్పటివరకు కనీసం మున్సిపల్ నల్లా కనెక్షన్ సైతం ఇవ్వలేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు నీటిపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా ఉండేందుకు మున్సిపల్ నల్లా కనెక్షన్ ఉంటే ఎంతో ఉపశమనంగా ఉంటుందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

నేను కొద్ది రోజుల క్రితమే ఈ ఆసుపత్రికి వచ్చాను. దవాఖానాలో నీటి సమస్య విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ కూడా స్పందించారు. త్వరలోనే మున్సిపల్ నల్లా కనెక్షన్ ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు.

– డాక్టర్ దాక్షాయిని, ఆసుపత్రి సూపరింటెండెంట్

దరఖాస్తు చేసుకుంటే నల్లా కనెక్షన్ ఇస్తాం..

ఆసుపత్రికి మున్సిపల్ నల్లా కనెక్షన్ లేదు. సంబంధిత దవాఖానా వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే నల్లాను బిగిస్తాం.

– జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని... ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ ఆర్ ఎంఎస్, ఎంఎంఎస్ ఎంప్లాయిస్ గ్రూప్–సీ మెయిల్ కార్డ్స్, ఎంటీఎస్ తెలంగాణ సర్కిల్ 4వ వార్షిక సదస్సు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలన్నారు. కేంద్రం తెచ్చిన 4 కార్మిక చట్టాలు వారి హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎన్‌పీఓ సెక్రటరీ జనరల్ వాసిరెడ్డిశివాజీ, ఆర్. మురళి, యూనియన్ తెలంగాణ సర్కిల్ చీఫ్ సెక్రటరీ పండు, కృష్ణ, నాగయ్య గౌడ్, రఘునాథ్‌స్వామి, విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఎన్నికలను బహిష్కరించండి

కాచిగూడ: మున్నూరుకాపు మహాసభ పేరుతో బోగస్ ఎన్నికలు నిర్వహించటం చట్ట విరుద్ధమని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోగస్ పేరుతో రాష్ట్ర మహాసభ ఎన్నికలు పిల్ల శ్రీనివాస్‌రావు నిర్వహించడం నియమావళికి విరుద్ధమన్నారు. ఎన్నికలను మున్నూరుకాపు మహాసభ జీవిత కాల సభ్యులందరూ బహిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. మే 4వ తేదీన నిర్వహించే బోగస్ ఎన్నికలను ఎవరూ నమ్మవద్దని ఆయన సూచించారు. తెలంగాణ మున్నూరుకాపు మహాసభ 1930లో స్థాపించి 1970లో రిజిస్టర్ అయ్యిందన్నారు. మున్నూరు కాపులకు మహాసభ మాతృసంస్థ అని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి జూన్ చివరివకు జీవిత కాల సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మహాసభకు ఇటీవలే రూ.2కోట్లతో స్వంత భవనాన్ని కూడా కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు మణికొండ రమేష్ కుమార్, బండెల జితేందర్. కొండూరు వినోద్ కుమార్, ఏనుగుల మాణిక్ ప్రభు, కొంతం సురేష్ బాబు, మ్యాడం రామేశ్వర్ రావు, సప్పిడి శ్రీనివాస్ రావు, పంజాల దత్తుమూర్తి, ఐలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



ముషీరాబాద్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మోహినోద్దీన్ పేర్కొన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షాన్‌నగర్‌లో ఆశ్రిత ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహ రహిత భారతదేశం పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల ఏర్పడే అనర్థాలను ప్రజలకు వివరించారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఆజీపాషా, బీఆర్ఎస్ నాయకులు చాంద్‌పాషా, దిల్బర్ హుస్సేన్, ఆశ్రత్ ఎన్‌జీవో ప్రాజెక్టు కోఆర్డినేటర్ మాధవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌టీ కార్మికులకు ఏసీ బస్సులు



అజమాబాద్ వీఎస్‌టీ కంపెనీ వద్ద ఏసీ బస్సులను ప్రారంభిస్తున్న ఆర్‌డీ చంద్రశేఖర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్‌టీ కార్మికులకు గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాజీ ఎంపీ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.సంజీవ్‌రెడ్డి దశలవారీగా అమలు చేస్తున్నారని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వర్కర్స్ యూనియన్ సలహాదారులు ఆర్‌డీ చంద్రశేఖర్ అన్నారు. కార్మికులు ప్రతిరోజు నగరంలోని అజమాబాద్ వీఎస్‌టీ నుంచి తుప్రాన్‌లో ఏర్పాటు చేసిన నూతన కంపెనీకి వెళ్లేందుకు ఐదు ఏసీ బస్సులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తాము గెలిస్తే ఏసీ బస్సులను తీసుకొస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారుడు కె.రాజు, ప్రధాన కార్యదర్శి ఎల్‌డీ పాల్, ముఖ్య ఉపాధ్యక్షుడు వి.నగేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్, ప్రభాకర్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో బంగారు ఆభరణాలు చోరీ

కాచిగూడ: రైలులో బంగారు ఆభరణాలు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... పంజాగుట్ట ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు (67) భార్యతో కలిసి తిరువన్నమలై నుంచి కాచిగూడకు రావడానికి నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్నారు. చిట్యాల రైల్వే స్టేషన్ వద్ద చూసుకునే సరికి బ్యాగు కనిపించలేదు. బ్యాంకులో 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 గ్రాముల సిల్వర్ ఆభరణాలు, డెబిట్ కార్డులు, ఐడీ కార్డులు ఉన్నాయి. సోమవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నల్గొండ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

మరో ఘటనలో...

తిరువన్నమలై నుంచి కాచిగూడకు రావడానికి నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లో నాగమల్లిక (38) ప్రయాణిస్తున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దిగిన తరువాత ట్రావెలింగ్ బ్యాగ్ కనిపించ లేదు. బ్యాగులో 12గ్రాముల బంగారు ఆభరణాలు, బట్టలు, ఇతర వస్తువులు ఉన్నాయని తెలిపింది. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంక్‌బండ్‌పై రోడ్డు ప్రమాదం

మహిళ మృతి



శారద (ఫైల్)

కవాడిగూడ: ట్యాంక్ బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా తడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన అంబీర్ మధుసూదన్‌రావు, శారద దంపతులు హోండా షైన్ ద్విచక్ర వాహనంపై జేబీఎస్ నుంచి మెహిదీపట్నంలోని తమ కుమారుడి ఇంటికి వెళ్తున్నారు. తిక్కన సోమయాజీ విగ్రహం సమీపం వద్దకు రాగానే అశోక్ లేల్యాండ్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ వారి వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన శారదా మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ అష్రఫ్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

విశ్వవిద్యాలయాల్లోని సమస్యలను పరిష్కరించాలి

ముషీరాబాద్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో అన్ని యూనివర్సిటీల విద్యార్థుల ముఖ్య కార్యకర్తల సమావేశం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీడీఎస్‌యూ పూర్వ అధ్యక్షుడు బి.ప్రదీప్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అనేక సమస్యలు తిష్టవేశాయన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా అక్కడి సమస్యలకు పరిష్కారం లభించడం లేదన్నారు.

వైభవంగా శ్రీశంకర జయంతి మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శారదామాత, శంకర భగవత్పాదులు



ఆది శంకరాచార్య జయంతి వేడుకల్లో మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ శంకరమఠర్‌లో సోమవారం శ్రీశంకర జయంతి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం శక్తిగణపతికి ఆది పూజలు చేశారు. అనంతరం చంద్రమౌళీశ్వరస్వామికి పూజలు చేసి, శారదాంబకు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు కావించారు. అలాగే శంకర భగవత్పాదులకు విశేష పూజలు చేశారు. సాయంత్రం మహామహోపాధ్యాయ, అద్వైతసిద్ధి రత్నాకర ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రవచించిన 'శ్రీ శంకర విజయం 'ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పూజలో శంకరమఠం నల్లకుంట శాఖ ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాసమూర్తి, బ్రాంచ్ హెడ్ గోరుగంతు రవి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ సువర్ణ భారతి గోశాలలో...

కాచిగూడ: బైరామల్‌గూడలోని సువర్ణ భారతి గోశాలలో సోమవారం ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తత్వం చారిటబుల్ ట్రస్ట వ్యవస్థాపక అధ్యక్షుడు పళ్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంత లక్ష్మి, బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి, మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి, కొచ్చర్లకోట రవి, కొచ్చర్లకోట విజయ శార్వాణి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వంద గజాల స్థలం కేటాయించాలి

కవాడిగూడ: ఇళ్లు లేని పేదలందరికి గ్రేటర్ హైదరాబాద్‌లో వంద గజాల ఇంటి స్థలం కేటాయించి పట్టాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఇల్లు లేని నిరుపేదలకు వంద గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తెలంగాణ గుడిసెవాసుల సంఘం (టీజీవీఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... ఎన్నికల ముందు పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటిని నిర్మించుకోవాడానికి నిధులు మంజూరు చేస్తామన్న కాంగ్రెస్ ఆ హామీని మరచిపోయిందన్నారు. ప్రభుత్వ స్థలాలను అమ్మే ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కాచవాని సింగారం, తట్టిఅన్నారం, ఆర్‌కే నగర్ తదితర ప్రాంతాల 3వేల మంది గుడిసెల వాసులకు స్థలాలు ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఈ ధర్నాకు తెలంగాణ గుడిసె వాసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాకీ రవి అధ్యక్షత వహించగా, ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ఎంఆర్‌పిఎస్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ బీఎస్ రమేష్‌కుమార్ మాదిగలు హాజరై మద్దతు ప్రకటించారు.

బీజేపీ బలోపేతానికి సైనికుడిలా పనిచేయాలి



వినాయక్‌నగర్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీ డా. కె. లక్ష్మణ్

కవాడిగూడ: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురాం ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్‌లోని వినాయక్‌నగర్‌లో బీజేపీ జెండాను ఆయన కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... కేంద్రంలో మోదీ హయాంలో నిరుపేదల కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షమ పథకాలను ఇంటింటికి వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కార్యకర్తల పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న తీరును కూడా ఇంటింటికి వివరించాలని ఆయన సూచించారు.

◆ రాబోయే రోజుల్లో ఎలాంటి ఎన్నికలు ఎదురైనా బీజేపీ భారీ మెజార్టీతో గెలిచేలా కార్యకర్తలు తమ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడులను దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించి శాంతికోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ మోర్చా నియోజకవర్గం కన్వీనర్ పి.పరశురాం అధ్యక్షత వహించగా మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్,కె.పరిమళ్ కుమార్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గం కన్వీనర్ ఎం.రమేష్‌రాం, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీఎస్ చారి, సురేష్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని పెకిలించివేయాలి

కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై అత్యంత క్రూరంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదుల పీచమణచాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్/అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలలో ఉగ్రదాడిలో బలైన వారికి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... ఉగ్రవాదులకు వత్తాసు పలికి ప్రోత్సహించే వాళ్లు తీవ్రవాదుల కన్న ప్రమాదకరమని అన్నారు. అలాంటి వారికి ఈ దేశంలో స్థానం లేదన్నారు. ప్రభుత్వాలు అలాంటి వారిని గుర్తించి కఠినంగా శిక్షించి ఆ తర్వాత దేశబహిష్కరణ చేయాలని కోరారు. మరోమారు ఉగ్రదాడులకు పాల్పడాలనే ఆలోచన రాకుండా వెన్నులో వణుకు పుట్టేలా భారత ప్రభుత్వం ఉగ్రవాదులపై దాడులకు దిగాలన్నారు.

– ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం



జాతీయ జెండాలు పట్టుకుని నివాళులర్పిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, జనార్దనామూర్తి



జాతీయ జెండాలు పట్టుకుని నివాళులర్పిస్తున్న కళాకారులు, సాహితీవేత్తలు



ముషీరాబాద్ చౌరస్తాలో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



శివం రోడ్డులో కొవ్వత్తుల ప్రదర్శనలో బీజేపీ నేతలు



మున్సిపల్ కాలనీలో కొవ్వత్తుల నివాళి అర్పిస్తున్న స్థానికులు